

కలెక్టర్‌ను కలిసిన రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు



వినతిపత్రం అందిస్తున్న శంకర్‌నాయక్

ఏలూరు :రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ శనివారం ఏలూరు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పెదపాడులో నివసిస్తున్న ఎస్‌టి సామాజిక తరగతికి చెందిన వారు తమ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారని, సదరు సమస్యను పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ వడిత్యా శంకర్ నాయక్ వినతిపత్రాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వికి అందించారు. పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ పివిఎస్.శ్రీనివాసనాయుడు, ఏలూరు అర్బన్ తహశీల్దార్ జివి.శేషగిరి ఉన్నారు.

సాగు సాయం నిల్..!

మోడీ ప్రభుత్వం 2025 - 26 బడ్జెట్‌లో రైతులకు మొండిచేయి చూపించింది. శనివారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయానికి సంబంధించిన కీలక అంశాలపై కనీస ప్రస్తావన లేకుండా పోయింది. పండించిన పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టంపై నోరు విప్పలేదు. పెద్ద ఎత్తున విదేశీ మారక ద్రవ్యం సమకూరుస్తున్న ఆక్వా సాగు ప్రస్తావన లేకుండా పోయింది. పోలవరానికి నిధులు కేటాయింపు కొంతమేర చూపించినా, రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై స్పష్టత రాని పరిస్థితి నెలకొంది. వేతన జీవులకు పన్ను మినహాయింపులో మాత్రం ఊరట లభించిన పరిస్థితి నెలకొంది.

కేంద్ర బడ్జెట్‌లో రైతులకు మోడీ సర్కార్ దగా
మద్దతు ధర గ్యారెంటీ చట్టం ఊసే కరువు
ఆక్వారైతులకు దక్కని భరోసా
'పోలవరం'కు రూ. 5,936 కోట్లు కేటాయింపు
రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై స్పష్టత కరువు
వేతన జీవులకు రూ.12 లక్షల వరకూ పన్ను మినహాయింపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్న జిల్లా రైతాంగానికి నిరాశే మిగిలింది. వ్యవసాయానికి సాయం చేసే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు లేకుండా పోయాయి. జిల్లాలో 80 శాతానికిపైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయంపై తీసుకునే ప్రతి నిర్ణయంపైనా ఇక్కడి రైతులపై ప్రభావం చూపుతోంది. రైతులు ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్నా మిగులు అనేది లేకుండా పోతోంది. జిల్లాలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, పామాయిల్ వంటి పంటలతోపాటు, మామిడి, పత్తి, చెరకు వంటి అనేక పంటలను రైతులు సాగుచేస్తున్నారు. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో సాగు సంక్షోభంలో కూరుకుపోయిన పరిస్థితి నెలకొంది. దీంతో మద్దతు ధరల గ్యారెంటీ చట్టం కోసం రైతులు ఎప్పటి నుంచో ఆందోళనలు చేస్తున్నారు. ఢిల్లీ సరిహద్దులో ఏళ్ల తరబడి రైతులు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. ఈ బడ్జెట్‌లో మద్దతు గ్యారెంటీ చట్టంపై ఏదైనా నిర్ణయం ఉంటుందని రైతులు ఆశించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం వస్తే వ్యవసాయ పెట్టుబడి ఖర్చులకు అదనంగా 50 శాతం పంటలకు ధర నిర్ణయం ఉంటుంది. ఇది వ్యవసాయ సాగుకు ఎంతగానో ఉపయోగపడుతోంది. మోడీ ప్రభుత్వం బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేకుండా ముందుకు సాగింది. దీంతో రైతుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఇటీవల కాలంలో కాంప్లెక్స్ ఎరువుల ధరలు బస్తా రూ.1,400 నుంచి రూ.1,700లకు పైగా చేరింది. ఎరువుల ధరలకు సంబంధించి ఊరట ఇచ్చేలా బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావన లేని పరిస్థితి నెలకొంది. కౌలు రైతులకు సంబంధించి ఎటువంటి ఊసూ లేకుండా పోయింది. విదేశీ మారక ద్రవ్యం ఆర్జించే ఆక్వా రైతులకు బడ్జెట్‌లో ఎటువంటి ఊరట లభించలేదు. ఆక్వా రైతులకు సంబంధించి ఏమైనా సబ్సిడీలు ఉంటాయని రైతులు భావించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రెండు లక్షలకు పైగా ఎకరాల్లో ఆక్వా సాగు సాగుతోంది. బడ్జెట్‌లో ఆక్వా ప్రస్తావన లేకపోవడంతో జిల్లా రైతాంగానికి ఎటువంటి మేలు లేకుండా పోయింది.

'పోలవరం'కు రూ.5,936 కోట్లు కేటాయింపు

పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.5,936 కోట్లు కేటాయింపులు జరిగాయి. నిర్వాసితులకు పరిహారం కింద రూ.30 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం తేల్చింది. 2027కు పోలవరం ప్రాజెక్టు మొదటి దశ 41.15 మీటర్ల ఎత్తుకు పూర్తిచేసి కాలువలకు నీరు మళ్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ప్రాజెక్టులో నీరు నిల్వ చేస్తే నిర్వాసిత గ్రామాలన్నీ ముంపునకు గురవుతాయి. నిర్వాసిత ప్రజలకు పూర్తిస్థాయిలో పరిహారం అందించి ఖాళీ చేయించాల్సి ఉంది. ప్రస్తుతం కేటాయించిన నిధులు ఏమాత్రమూ సరిపోని పరిస్థితి. ఈ విధంగా నిధులు కేటాయిస్తే నిర్వాసితులకు పరిహారం ఎప్పటికి అందిస్తారో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది.

రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై స్పష్టత కరువు..

జిల్లాలోని కొవ్వూరు, భద్రాచలం, నరసాపురం, కోటిపల్లి రైల్వేలైన్లకు నిధులు కేటాయింపులకు సంబంధించి స్పష్టత లేకుండా పోయింది. కేటాయింపులు జరిగాయా, పక్కకు పెట్టేసారా అనే విషయం స్పష్టత వస్తే జిల్లాకు ఎంతమేర ప్రయోజనం చేకూరుతుందో తెలుస్తోంది.

వేతన జీవులకు ఊరట.. ★★★

ఉద్యోగవర్గాలకు మాత్రం ఈ బడ్జెట్‌లో కొంత ఊరట లభించింది. పన్ను మినహాయింపు రూ.12 లక్షల వరకూ పెంచారు. గతంలో మూడు లక్షల వరకూ నో టాక్స్ ఉండగా ఈ బడ్జెట్‌లో రూ.నాలుగు లక్షలకు పెంచారు. నాలుగు నుంచి ఎనిమిది లక్షలకు రూ. ఐదుశాతం, రూ.8-12 లక్షల వరకూ పదిశాతం, రూ.12 నుంచి రూ.16 లక్షల వరకూ 15 శాతం, రూ.16-20 లక్షల వరకూ 20 శాతం, రూ.20-24 లక్షల వరకూ 25 శాతం, రూ.24 లక్షలు పైన 30 శాతం పన్ను కట్టాల్సి ఉంటుంది.

నెల్లూరులో జరుగుతున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభకు జిల్లా నుంచి హాజరైన ప్రతినిధులు, జిల్లా నుంచి చర్చల్లో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ లింగరాజు, పి.రామకృష్ణ.

ఎంఎల్‌సి ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు గాను కౌంటింగ్ కేంద్రంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ సెంటర్‌ను శనివారం అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి 3 లక్షల 15 వేల 261 మంది ఓటర్లు ఉన్నారని, ఇందుకోసం జిల్లాలో 440 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం మార్చి 3వ తేదీన సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లా, కోనసీమ, కాకినాడ జిల్లాలకు సంబంధించి బ్యాలెట్ బాక్సులు ఏలూరు జిల్లాకు చేరుకుంటాయని, వాటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కౌంటింగ్ హాల్లో ఫలితాలు ప్రదర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, పెదపాడు తహశీల్దార్ కృష్ణ జ్యోతి, సర్వేయర్ రమణారావు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల నియమావళి అమలుకు ఎంసిసి బృందాలు ఏర్పాటు

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కోసం ప్రత్యేక అధికార బృందాలను నియమిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. మున్సిపల్, మండలస్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును ఈ బృందాలు పర్యవేక్షిస్తాయన్నారు. మున్సిపల్ మండలాల వారీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి కోసం 22 ఎంసిసి బృందాలు, 21 స్పెషల్ వీడియో బృందాలు ఏర్పాటు చేశారు. భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, నిడమర్రు, పెదపాడు, పెదవేగి, చింతలపూడి, ఉంగుటూరు, లింగపాలెం, వేలేరుపాడు, పోలవరం, జీలుగుమిల్లి, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం అర్బన్, రూరల్, బుట్టాయగూడెం, ద్వారకాతిరుమల, కుక్కునూరు, టి.నరసాపురం, కొయ్యలగూడెం మండలాలకు ఒక్కో బృందం, ఏలూరు కార్పొరేషన్-2కు ఎంసిసి బృందాలను ఏర్పాటు చేశారు. వీటికి అధనంగా 21 ప్రత్యేక వీడియో బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి ఎంసిసి, ప్రత్యేక వీడియో బృందాలు ఎప్పటికప్పుడు సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులకు రోజువారీ నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాష్ట్రానికి మళ్లీ మొండిచేయి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

పోలవరం ప్రాజెక్టు పునరావాసం, పరిహారం, ప్యాకేజీ గురించి బడ్జెట్లో ప్రస్తావించకపోవడం దారుణమని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆశలను అడియాసలు చేసిందని, ఎపికి మళ్లీ మొండి చేయి చూపిందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వలేదని, విభజన చట్టం ప్రకారం ఏ జాతీయ విద్యా సంస్థకూ కేటాయింపులు చేయలేదని, విశాఖ రైల్వేజోన్, ఎన్ఐటి, ఐఐటి, ఐఐఎం, ట్రిబుల్ ఐటి, ఐఐఎస్ఇఆర్, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, దుగరాజుపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో, ఎయిమ్స్, వెనుకబడిన జిల్లాల నిధులు, రాజధాని నిర్మాణానికి నిధులు విషయమై బడ్జెట్లో ఊసే లేకపోవడం బాధాకరమని విమర్శించారు. రాజధాని నిర్మాణానికి గతంలో ప్రకటించిన ప్రపంచ బ్యాంకు రుణాన్ని పదేపదే ప్రస్తావించారు తప్ప కొత్తగా కేటాయింపులు ఏమీ చేయలేదని తెలిపారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఆ పార్టీతో అంటకాగుతున్న టిడిపి, జనసేన పార్టీలు కేంద్రాన్ని నిలదీయాలని పేర్కొన్నారు. ఏ జాతీయ ప్రాజెక్టు నైనా పూర్తి చేయాలంటే ముందుగా ఆ ప్రాజెక్టు కోసం తమ భూములు, సర్వస్వాన్ని కోల్పోయిన ప్రజలకు నష్టపరిహారం, పునరావాసం పూర్తిగా చెల్లించాకే ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలని నిబంధనలు ఉన్నా కేంద్ర ప్రభుత్వం వాటిని తుంగలో తొక్కి పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. కేంద్రం చేస్తున్న ద్రోహాన్ని నిలదీయలేని రాష్ట్ర పార్టీలను ప్రజలు నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యార్థులు సౌకర్యాలను వినియోగించుకోవాలి

గిరిజన బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్

ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రెండు రోజుల ఏజెన్సీ గిరిజన ప్రాంత పర్యటనలో భాగంగా రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్ మండలంలోని బుసరాజుపల్లి గిరిజన బాలికల గురుకుల వసతి గృహాన్ని శనివారం సందర్శించారు. గురుకుల పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి పదో తరగతి, ఇతర తరగతుల విద్యార్థులతో మాట్లాడి బోధన విషయంలో అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుసరాజుపల్లి పాఠశాల ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉందన్నారు. గిరిజన విద్యార్థులందరూ తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను, అవకాశాలను అందిపుచ్చుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. గురుకుల పాఠశాలలో 480 మంది విద్యార్థులు జూనియర్ కళాశాలలో కొంతమంది విద్యార్థులు ఉండగా గురుకుల పాఠశాల, కళాశాలలో డార్మెటరీ పాఠశాల పరంగా ల్యాబ్ పరంగా కొన్ని భవనాలు కావాలని, పాఠశాల, కళాశాల ప్రాంగణంలో సిసి రోడ్లు ఏర్పాటు, ఆటస్థలంలో వర్షం పడితే నీటి నిల్వ ఉండడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు, అధికారులు ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్య రాష్ట్ర వ్యాప్త సమస్య అని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కళాశాల, పాఠశాలలో సౌకర్యాల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ డిడి పివిఎస్.నాయుడు, తహశీల్దార్ చలపతిరావు, ఎటిడబ్ల్యుఒ శ్రీవిద్య, ఐసిడిఎస్ పిఒ తులసి, ఎస్ఎంసి ఛైర్మన్ సున్నం జోగి రాజు పాల్గొన్నారు.

పోల్‌రాజ్ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

తాగునీటి చెరువులను వెంటనే నింపుకోవాలి

పోల్‌రాజ్ కెనాల్, సిబి కెనాల్ ఎఇలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న మంచినీటి చెరువులను పంచాయతీ కార్యదర్శులు వెంటనే నింపుకోవాలని పోల్‌రాజ్ కెనాల్, సిబి కెనాల్ ఎఇలు బి.సిద్ధార్థ, వివికె.కిషోర్ కోరారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని ప్రధాన పంట కాలువలైన సిబి కెనాల్, పోల్‌రాజ్ కెనాల్‌లకు తాగునీటి అవసరాల నిమిత్తం ఉన్నతాధికారులు కాలువలకు నీటిని విడుదల చేశారన్నారు. ప్రస్తుతం పోల్‌రాజ్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, సిబి కెనాల్‌కు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వారు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు కాలువల ద్వారా ప్రవహిస్తున్న తాగునీటిని కార్యదర్శులు, సర్పంచులు సమన్వయంతో కాలువ గట్లపై ఇంజన్ల ఏర్పాటు చేసుకుని మంచినీటి చెరువులను నింపుకోవాలన్నారు. మళ్లీ ఏప్రిల్ నెలలో మాత్రమే కాలువలకు మంచినీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహించకుండా మంచినీటి చెరువులను నింపుకొని ప్రజలకు నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలకు విడుదల చేసిన నీటిని మినుము రైతులు చేలకు వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా కాలువల ద్వారా సరఫరా చేస్తున్న తాగు నీటిని ఎవరైనా చేపల చెరువుల రైతులు దారి మళ్లిస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

కేసులు త్వరగా విచారించాలి

రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి సురేష్‌రెడ్డి

మాట్లాడుతున్న న్యాయమూర్తి సురేష్‌రెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

న్యాయమూర్తులు కేసులను త్వరితగతిన విచారించి తీర్పులు వెలువరించాలని, ఈ క్రమంలో తీర్పుల్లో నాణ్యత లోపించకూడదని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సురేష్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం ఆయన జ్యుడిషియల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ గౌరవ సుప్రీంకోర్టు వారు సివిల్ కేసులు, విచారణలో ఉన్న ఖైదీల కేసుల తీర్పులను త్వరితగతిన వెలువరించడానికి ప్రయత్నించాలని సూచించారన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఎసి) ఎం.సునీల్‌కుమార్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసుల వివరాలు, భవన సముదాయాల పరిస్థితులపైన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఇతర జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన విదేశీ నిపుణుల బృందం



ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న విదేశీ నిపుణుల బృందం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టును విదేశీ నిపుణుల బృందం శనివారం పరిశీలించింది. ఈ బృందంలో అమెరికాకు చెందిన అంతర్జాతీయ నిపుణులు డియాన్ ఫ్రాన్కోడి కికో, డేవిడ్ పాల్ ఉన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న బృందం ప్రత్యేక వాహనాల్లో పోలవరం ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకున్నారు. భోజన విరామానంతరం పోలవరం ప్రాజెక్టు డయాఫ్రంవాల్ నిర్మాణ ప్రాంతానికి చేరుకుని అక్కడ డయాఫ్రంవాల్ ప్లాస్టిక్ కాంక్రీటు పనులు, డయాఫ్రంవాల్ ట్రెంచ్ కట్టింగ్ పనులు, బెంటోనైట్ మిక్సింగ్ ట్యాంకుల వద్ద డిశాండింగ్ పనులు పరిశీలించారు. అనంతరం బెంటోనైట్ మిక్సింగ్, ప్లాస్టిక్ కాంక్రీటు మిక్సింగ్ జరుగుతున్న బ్లాచింగ్ ప్లాంటులను పరిశీలించారు. ప్లాస్టిక్ కాంక్రీటు పనుల తీరు, డిశాండింగ్‌లో వస్తున్న మట్టి రాతి నమూనాలను డయాఫ్రంవాల్ ప్రాంతంలో ఉన్న ల్యాబ్‌లో పరిశీలించారు. ఆ ప్రాంతంలో అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. సంబంధిత వివరాలను సిఇ నరసింహమూర్తి, ఎస్ఇ రామచంద్రరావు బావర్ కంపెనీ ప్రతినిధి హసన్ మెగా కంపెనీ ప్రతినిధి అంగర సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు అతిథి గృహంలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో గంటసేపు సమావేశం నిర్వహించారు. అనంతరం రాజమహేంద్రవరం తరలివెళ్లారు. ఈ బృందం ఆదివారం కూడా పోలవరం ప్రాజెక్టు పరిశీలన కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఇంజినీరింగు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అథారిటీ చీఫ్ ఇంజినీర్ రాజేష్ కుమార్, ఇఇలు సుధాకర్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలు పూర్తయ్యే వరకూ పిజిఆర్ఎస్ నిలుపుదల

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎంఎల్‌సి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ప్రతి సోమవారమూ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను తాత్కాలికంగా రద్దు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకూ ఏలూరు కలెక్టరేట్ కార్యాలయం, జిల్లాలోని అన్ని డివిజన్, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో జరుగు పిజిఆర్ఎస్ (మీకోసం) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేయనున్నట్లు తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 27న ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు కార్యక్రమం మార్చి 3వ తేదీన జరుగుతుంది. ఎన్నికల ప్రక్రియ మార్చి 8వ తేదీన ముగుస్తుంది.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం పరిరక్షించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం, డిబ్బకాయలపాడు, పొం గుటూరు, ఎర్రవరం ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులు సమావేశమ య్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణా రావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇప్పటికీ కార్మికుల సంక్షేమంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం హ యాంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాల అమలును నిలిపివేసి, 12, 14 మెమోలను రద్దు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కార్మిక సంక్షేమ బోర్డును తిరిగి పున:స్థాపించి కార్మికులకు మంజూరు చేయాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డుకు సంబంధించిన నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించుకుంటుందన్నారు. సిఐటియు జిల్లా నాయకులు శుక్ల బోయిన రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుత ప్రభుత్వంలోనూ భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మృతిచెందిన కార్మిక కుటుంబాలకు నష్టపరిహారం ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరారు.

తొలిరోజే 94.44 శాతం పింఛన్ల పంపిణీ

మిగిలిన వారికి 3న అందజేత

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జిల్లాలో తొలిరోజైన శనివారం రాత్రి ఏడు గంటల సమయానికి 94.44 శాతం పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్, డిఆర్‌డిఎ అధికారుల పర్యవేక్షణలో సచివాలయాల సిబ్బంది పింఛన్ల పంపిణీని ఉదయం ఆరు గంటల నుంచే ప్రారంభించారు. జిల్లాలో 2,61,454 మంది లబ్ధిదారులు ఉండగా, రూ.113 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. శనివారం రాత్రి ఏడు గంటల సమయానికి డిఆర్‌డిఎ అధికారుల నివేదికల ప్రకారం జిల్లాలో 2,46,924 మందికి (94.44 శాతం) రూ.106.55 కోట్లు అందించారు. ఇంకా కేవలం 14,530 మందికి మాత్రమే పింఛన్ల పంపిణీ జరగాల్సి ఉంది. ఫిబ్రవరి రెండో తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి మూడో తేదీ సాయంత్రంలోగా మిగిలిన వారందరికీ పింఛన్లు అందించి నూరుశాతం లక్ష్యాన్ని సాధిస్తామని అధికారులు తెలిపారు.

ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ల పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ప్రాజెక్ట్ సిడిపిఒ ఎ.పద్మావతి శనివారం ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్లలో బియ్యం, పప్పు, నూనెలను పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ పప్పు నాణ్యతను పరిశీలించినట్లు తెలిపారు. అదేవిధంగా 93 రేషన్ షాపులకు 53 షాపులకు, అంగన్వాడీ సెంటర్లకు పప్పు సరఫరా చేసినట్లు తెలిపారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్ఎకు జనసేన నాయకుల వినతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం ప్రాజెక్టు ముంపులోని గ్రామాలను ఒక యూనిట్గా చేసి 41.15 కాంటూరు పరిధిలో కలపాలంటూ కుక్కునూరు మండలానికి చెందిన జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు బర్రింకలపాడులోని క్యాంపు కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న ఆర్అండ్ఆర్ ప్యాకేజీ సమస్యలు పరిష్కరించాలని, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ పరిహారం అందేలా చూడాలని, ముంపు మండలాల నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు మొలిశెట్టి యుగంధర్, ఉపాధ్యక్షుడు మంత్రి గోపాలకృష్ణ, నాయకులు చల్లా కోటి, మొలిశెట్టి నరేష్, నరసింహారావు, సీతారామయ్య, గిరిజన నాయకులు కూరం సంజీవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

వాలంటీర్ల వ్యవస్థ అమలు చేయాలి

పట్టభద్రుల స్వతంత్ర ఎంఎల్సి అభ్యర్థి దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వాలంటీర్ వ్యవస్థను అమలు చేయాలని, ప్రభుత్వం నిరంకుశ ధోరణి వీడనాడాలని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల స్వతంత్ర ఎంఎల్సి అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఏలూరు నుంచి కాకినాడ వరకు దుర్గాప్రసాద్ చేపట్టిన పాదయాత్ర శనివారానికి కొయ్యలగూడెం మండలానికి చేరుకుంది. రోటరీ క్లబ్ కల్ప వృక్ష వృద్ధాశ్రమంలో దుర్గాప్రసాద్ పాదయాత్రను అభినందిస్తూ వృద్ధులు హారతులు పట్టి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఒకటో తేదీ పొందాల్సిన పెన్షన్లు అందలేదని, సాంకేతిక కారణాల వల్ల ఇబ్బందులని అధికారులు చెబుతున్నారని వృద్ధులు దుర్గాప్రసాద్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ తాను చేపట్టిన పాదయాత్ర ఆరు రోజులు పూర్తయిందన్నారు. ఇప్పటివరకు 118 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టానన్నారు. సిపిఎస్ రద్దు, మెగా డిఎస్సి నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి, ప్రయివేట్ లెక్చరర్స్, టీచర్ల ప్రత్యేక చట్టం, వారికి హెల్త్ కార్డ్ అమలే తన ధ్యేయమన్నారు. ఎంఎల్సిగా గెలిస్తే వాటి సాధనకు కృషి చేస్తానన్నారు. కొయ్యలగూడెం గణేష్ సెంటర్లో నిరుద్యోగులు, ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు ప్రసాద్ను సత్కరించారు.

సింగరాయపాలెం- చేవూరు రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎట్టకేలకు సింగరాయపాలెం-చేవూరు ఆర్అండ్బి రోడ్డుకు మోక్షం లభించింది. ఈ రోడ్డు ఆసాంతం గుంతలతో అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల పలువురు ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డులో ప్రమాదాలకు గురై మరణించారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండలంలోని చేవూరు గ్రామం నుంచి సింగరాయపాలెం గ్రామం వరకు ఆర్అండ్బి అధికారులు రూ.80 లక్షల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఖాతాదారులకు అన్ని సేవలందించేందుకు కృషి

కెనరా బ్యాంక్ మేనేజర్ టి.కిరణ్కుమార్

ప్రజాశక్తి - పోలవరం

కెనరా బ్యాంకు ఖాతాదారులకు సేవలు అందించడంలో సిబ్బంది శక్తి వంచన లేకుండా పని చేస్తారని కెనరా బ్యాంక్ మేనేజర్ టి.కిరణ్కుమార్ అన్నారు. పోలవరం మండలం గూటాల కెనరా బ్యాంకులో శనివారం ఆయన మాట్లాడుతూ గూటాల గ్రామ చుట్టుపక్కల కెనరా బ్యాంక్ మాత్రమే ఉందన్నారు. అందువల్ల వినియోగదారులు అధిక సంఖ్యలో బ్యాంకుకు వస్తున్నారని చెప్పారు. వచ్చిన ప్రతి వినియోగదారుడికి అవసరమైన అన్ని సేవలను అందిస్తున్నామన్నారు. బ్యాంకు ఖాతాదారులకు, వినియోగదారులకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. మేనేజర్గా ఉద్యోగ బాధ్యతలు తీసుకుని మూడు నెలలు మాత్రమే అయిందని కిరణ్ కుమార్ తెలిపారు. కెనరా బ్యాంకులో సిబ్బంది కొరత తక్కువగా ఉన్న విషయాన్ని వినియోగదారులు గమనించి బ్యాంకు అధికారులకు సహకరించాలని కోరారు.

వీధి కుక్కల పట్టివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వైవాక, ఉటుకూరు, దేవపూడి గ్రామాల్లో వీధి కుక్కలను పట్టివేసినట్లు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శి పి.మనోజ్కుమార్ శనివారం తెలిపారు. ఆయా గ్రామాల్లో వీధి కుక్కలతో గ్రామస్తులు పడుతున్న ఇక్కట్లు పంచాయతీ దృష్టికి రావడంతో వీధి కుక్కల పట్టివేత కార్యక్రమం చేపట్టినట్లు మనోజ్కుమార్ తెలిపారు. మచిలీపట్నం నుంచి వచ్చిన కుక్కల వేటగాళ్ల బృందం గ్రామాల్లో అన్ని ప్రాంతాల్లో తిరిగి గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్న, కరుస్తున్న వీధి కుక్కలకు ఉచ్చులు వేసి బంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక వాహనంలో మచిలీపట్నం ప్రాంతంలోని మడఅడవుల్లో విడిచిపెట్టినట్లు ఆయన తెలిపారు. వైవాకలో 122, ఊటుకూరులో 102, దేవపూడిలో 30 మొత్తం 254 వీధి కుక్కలను పట్టివేసి మడ అడవుల్లో విడిచిపెట్టినట్లు పంచాయతీ కార్యదర్శి మనోజ్కుమార్ తెలిపారు.

5న ఫీజు పోరు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థులకు అండగా నిలుస్తూ చంద్రబాబు సర్కారుపై నిరసన గళాన్ని వినిపిస్తూ వైసిపి ఫీజు పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు తెలిపారు. ఏలూరులోని వైసిపి కార్యాలయంలో పత్రికా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫిబ్రవరి ఐదో తేదీన ఫీజు పోరు కార్యక్రమాలు నిర్వహిస్తూ ఫైర్ స్టేషన్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తూ కలెక్టర్కు వినతిపత్రం ఇవ్వనున్నామని తెలిపారు. అదేవిధంగా జిల్లా విద్యాశాఖ అధికారికి విద్యార్థుల సమస్యలను విన్నవిస్తూ వినతిపత్రం ఇస్తామని తెలిపారు. ఈ నెల ఐదో తేదీన జరగబోయే ఫీజు పోరు కార్యక్రమానికి పెద్దఎత్తున విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, వైసిపి కార్యకర్తలు, నాయకులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నియోజకవర్గ ఇన్ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, చింతలపూడి నియోజకవర్గ ఇన్ఛార్జి కంభం విజయరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నూజివీడులో చోరీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పట్టణంలో పాతపేటకు చెందిన రవికుమార్, లక్ష్మీసుజాత దంపతులు వివాహ వేడుకలకు తణుకు వెళ్లారు. శనివారం వచ్చి చూసేసరికి తలుపులు, బీరువా బద్దలు కొట్టి ఉన్నాయి. నాలుగు కాసుల బంగారం, మూడు కేజీల వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరులో ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది శనివారం దాడి చేశారు. ఈ దాడిలో కంచర్ల పార్వతిని అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి మూడు లీటర్ల నాటుసారాను స్వాధీన చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ వైవిఎన్ఎస్.ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు. ఇఎస్టిఎఫ్ సిబ్బంది మండలంలోని చెక్కపల్లి గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న చిలకబత్తుల తులసమ్మ వద్ద 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు మస్తానయ్య తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నిలిచిన భీమడోలు అగ్నిమాపక కేంద్రం సేవలు

పూర్తయిన వాహన కాల వ్యవధి
తాత్కాలిక ప్రాతిపదికన మరొక వాహనాన్ని అందుబాటులో ఉంచాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు అగ్నిమాపక కేంద్రం సేవలు నిలిచిపోయాయి. అగ్నిమాపక కేంద్రానికి కేటాయించిన వాహనం జీవిత గడువు ముగియటంతో దానిని పక్కన పెట్టి వేశామని, వేరొక వాహనం వచ్చేంతవరకు సేవలు అందుబాటులో ఉండమని అగ్నిమాపక కేంద్రం అధికారులు తెలిపారు. భీమడోలుకు రెండు వైపులా జాతీయ రహదారులు, మరొక రెండు వైపులా రాష్ట్రీయ రహదారులు ఉన్నాయి. వీటికి అదనంగా గోదావరి జిల్లా కృష్ణానదితో అనుసంధానం చేసేందుకు ఏర్పాటు చేసిన పోలవరం

జీవిత గడువు పూర్తి కావడంతో మూలన ఉన్న వాహనం

కాలువతో పాటు, కాకినాడ- చెన్నై జల రవాణాకు ప్రత్యేకించిన ఏలూరు కాలువ భీమడోలు గ్రామం మీదుగా వెళ్తుంది. పలు భారీ పరిశ్రమలు ఇక్కడే కొనసాగుతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని భీమడోలు అగ్ని మాపక కేంద్రాన్ని కీలకంగా గుర్తించిన అధికారులు భీమడోలుకు పలు ప్రత్యేక సౌకర్యాలు, అదనపు వాహనాలు, ఇతర సర్దుబాటులు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇటీవల అగ్నిమాపక కేంద్రం తనిఖీకి వచ్చిన రాష్ట్రస్థాయి అధికారి ఒకరు దీనిని ఖరారు చేశారు. దీంతో భీమడోలు అగ్నిమాపక కేంద్రానికి మహర్దశ పడుతుందని పలువురు భావించారు. గతంలో అగ్నిప్రమాదం జరిగితే తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు, లేదా వేరొక దూర ప్రాంతాల నుంచి అగ్నిమాపక శకటాలు రావాల్సి వచ్చేది. భీమడోలు కేంద్రం ఏర్పాటుతో ఆ సమస్యలన్నీ తీరిపోయాయి. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి అగ్నిమాపక కేంద్రం సేవలను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు ఏదైనా అగ్నిమాపక కేంద్రానికి చెందిన శకటం 15 ఏళ్ల కాల వ్యవధి దాటిన తర్వాత చెత్త కింద పరిగణలోకి తీసుకోవాల్సి వస్తుంది. భీమడోలులో అందుబాటులో ఉన్న అగ్నిమాపక కేంద్రం శకటం కాల వ్యవధి తీరటంతో అధికారులు దాన్ని మూలకు నెట్టేశారు. సేవలు బంద్ అయ్యాయి. అగ్నిమాపక కేంద్రంలో ప్రస్తుతం నెలకొన్న సమస్యల పరిష్కారానికి నూతన వాహనం కేటాయింపు జరిగేంతవరకు తాత్కాలిక ప్రాతిపదికన మరొక పని చేసే వాహనాన్ని అందుబాటులో ఉంచాలని అధికారులను వారు కోరుతున్నారు.

పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలవ్యాప్తంగా 4254 పింఛన్దారుల్లో నాలుగు వేల మందికి ఎన్టిఆర్ భరోసా పెన్షన్లను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి తెలిపారు. పెన్షన్ల పంపిణీలో కొంతసేపు సర్వర్ మొరాయించడంతో సిబ్బంది ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మండల వ్యాప్తంగా 94 శాతం పెన్షన్ల ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు.

అనారోగ్యంతో ఎంపిటిసి సభ్యులు రామకృష్ణ మృతి

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలం అంకన్నగూడెం ఎంపిటిసి సభ్యులు పిల్లి రామకృష్ణ మృతి చెందారు. కొన్నిరోజులుగా రామకృష్ణ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. రామకృష్ణ మృతి వార్త తెలుసుకున్న పెదవేగి ఎంపిపి తాతా రామ్యకుమార్, జెడ్పిటిసి సభ్యులు పి.విజయ్బాబు, పెదవేగి మండల ఎంపిటిసి సభ్యులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తమ సంతాపం ప్రకటించారు.

బాధిత కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి - భీమడోలు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి భీమడోలుకు చెందిన అయ్యప్ప తాపీ మేస్త్రి సంక్షేమ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. భీమడోలు మండల పరిధిలో ఇటీవల కాలంలో భవన నిర్మాణ పనుల్లో పాల్గొంటూ ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనల్లో ముగ్గురు భవన నిర్మాణ కార్మికులు చనిపోయారు. తాపీ మేస్త్రిలు సభ్యులుగా ఉన్న అయ్యప్ప తాపీ మేస్త్రిలు సంక్షేమ సంఘం తమతో పాటు పనిచేస్తూ చనిపోయిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. దీనిలో భాగంగా శనివారం బాధితులైన పొగురి మారుతికుమార్, గంటా గంగరాజు, గుర్రాల సురేష్ కుటుంబీకులను పరామర్శించిన సంఘ కార్యవర్గ సభ్యులు వారిని ఆదుకునే క్రమంలో ఒక్కొక్క కుటుంబానికి రూ.ఐదు వేల నగదుతో పాటు, 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, ఇతరాలను అందించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు కోటిపల్లి సీతారామయ్య, ఈతకోట తాతాజీ, కె.సోమరాజు, గాదం రాము పాల్గొన్నారు.

మోర్సపూడిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని మోర్సపూడిలో ఉచిత వైద్య శిబిరం తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్, ఎన్ఎస్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విజయవంతంగా నిర్వహించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ తిరివీధి కృష్ణ తెలిపారు. విజయవాడ నగరానికి చెందిన ఐ, జనరల్ కేర్ ఎన్ఎస్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు చెప్పారు. అత్యవసర విభాగ వైద్యులు ఎస్కె.నాయబ్ రసూల్, కంటి చికిత్స నిపుణులు జమ్ రుద్ షాహిన్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ క్యాంపులను నూజివీడు మండల పరిధిలోని మోర్సపూడి గ్రామ పరిసర ప్రాంతంలోని ప్రజలు వినియోగించుకున్నట్లు తెలిపారు. మరికొన్ని క్యాంపులు నూజివీడు నియోజకవర్గ పరిసరాలలో నిర్వహిస్తామని, పేదలు నివసించే ప్రాంతాలలో వైద్యసేవలను ఉచితంగా అందించేందుకు తమ ట్రస్ట్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని వివరించారు. వైద్య సేవలు అవసరమైన పేదలు 9640324266 సంప్రదించవచ్చని చెప్పారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికీ తిరివీధి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా ఎథిక్స్ హ్యూమన్ విలువలు పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలో ఇంటర్మీడియట్ క్వాలిఫైడ్ పరీక్షలో భాగంగా శనివారం ఎథిక్స్ హ్యూమన్ విలువలు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఆర్ఐఒ కన్వీనర్ కె.చంద్రశేఖర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 137 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 17,849 మంది హాజరవ్వగా 609 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

'విభజన ఆంధ్రప్రదేశ్కు బడ్జెట్లో సరైన కేటాయింపులు లేవు'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

విభజన ఆంధ్రప్రదేశ్కు బడ్జెట్లో సరైన కేటాయింపులు లేవని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి సుమారు రూ.32 వేల కోట్లు అవసరమైనప్పటికీ బడ్జెట్లో ఎటువంటి కేటాయింపులు చేయకపోవడం చాలా అన్యాయమని తెలిపారు. వెనకబడ్డ ఉత్తరాంధ్ర మూడు జిల్లాలు, రాయలసీమ నాలుగు జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీకి బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడంతో పాటు విశాఖ రైల్వే జోన్ కాని, కడప ఉక్కు ఫ్యాక్టరీ కాని, ఇతర విభజన హామీల పరిష్కారానికి ఏమీ కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న ఎన్డిఎ ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విభజన ఆంధ్రప్రదేశ్కు కేంద్ర బడ్జెట్లో రాష్ట్రాభివృద్ధికి దోహదపడే విధంగా కేటాయింపులు జరిపేలా ప్రయత్నించాలని తెలిపారు.

కృష్ణా జలాలనూ వినియోగంలోకి తెస్తాం

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, మేయర్ నూర్జహాన్పెదబాబు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని నగర ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దెందులూరు సమీపంలో ఉన్న గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూడడమే తమ బాధ్యతన్నారు. ఈ ఏడాది గోదావరి జలాలతో పాటు కృష్ణా జలాలను కూడా వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. గోదావరి జలాలు పంపింగ్ చేసే మోటార్లు, ఎలక్ట్రికల్ ట్రాన్స్ఫార్మర్ మరమ్మతులకు గురికాకుండా ప్రతిరోజు పర్యవేక్షణ జరగాలని అధికారులను ఆదేశించారు. గోదావరి కాలువలో తూడు ఎక్కువగా ఉండటం కారణంగా నీరు పంపింగ్ కష్టమవుతుందని గుర్తించామన్నారు. తూడు తొలగించడానికి సుమారు రూ.ఐదు లక్షల ఖర్చవుతుందని


ట్యాంకును పరిశీలిస్తున్న ఎంఎల్ఎ, మేయర్

తెలిపారు. ఆ పని కూడా చేయించడానికి సిద్ధం చేస్తున్నామన్నారు. అయితే ప్రజలు మంచినీటిని చాలా జాగ్రత్తగా వాడుకోవాలని, వృధా చేయరాదని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ సురేంద్రబాబు, డిఇలు రజాక్, తాతబాబు, ఎఇలు సాంబశివరావు, సాయి, అరుణ్, దేవ్, సంధ్య కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, కార్పొరేటర్లు జిన్నూరు కనక నరసింహారావు, తదితరులు ఉన్నారు.

పది పరీక్షల నిర్వహణకు సన్నాహకాలు

భీమడోలు :పదో తరగతి పరీక్షల నిర్వహణకు సన్నాహక చర్యలు పూర్తయ్యాయని, భీమడోలు ఎంఇఒ-1 శ్రీనివాసరావు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రోజుకు రెండు విడతలుగా నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన శనివారం పరిశీలించారు. గతేడాది మండలంలో 85 శాతంగా ఉన్న ఉత్తీర్ణతా శాతాన్ని నూరు శాతానికి పెంచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. అది సైతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యే వారి సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో భాగంగా భీమడోలు హైస్కూలును సందర్శించిన ఎంఇఒకు పాఠశాల ప్రగతి గురించి ఇన్ఛార్జి ప్రధానోపాధ్యాయులు అహమ్మద్ వివరించారు. అనంతరం విద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల నుంచి 511 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా భీమడోలు నుంచి 172 మంది హాజరవుతుండగా వీరిలో 50 మంది తెలుగు మాధ్యమంతో, మిగిలిన వారు ఆంగ్ల మాధ్యమంతో చదువుతున్నారన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ వారికి సహకరించేందుకు జిల్లా పరిషత్ సమకూర్చిన విజయకేతనం పుస్తకాలు ముందస్తుగా అందించామన్నారు. మండలం నుంచి అత్యల్పంగా కురెళ్లగూడెం హైస్కూల్ నుంచి 16 మంది మాత్రమే పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ఇక పొలసానిపల్లిలోని అంబేద్కర్ గురుకులం నుంచి 80 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ప్రస్తుత విద్యా సంవత్సరం ఒక పరీక్షా కేంద్రం పెరిగిందన్నారు. దీనిని భీమడోలులోని శ్రీ చైతన్య పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. ఇక భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఆగడాలలంక, పొలసానిపల్లి అంబేద్కర్ గురుకులం పరీక్షా కేంద్రాలు గతేడాది మాదిరిగానే కొనసాగుతాయన్నారు. పరీక్షల సమయంలో రవాణా, పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఇతర అంశాల గురించి ఉన్నతాధికారులతో మాట్లాడతామని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించిందని ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ ఇన్ఛార్జి సిడిపిఒ షెహనాజ్బేగం అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చదివే పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం ప్రభుత్వం యూనిట్ ఒక్కొక్కటి రూ.19,800 విలువైన ఆట వస్తువులను, బొమ్మలను కేటాయించిందని, వీటి పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 187 అంగన్వాడీ కేంద్రాలు, మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 117 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయన్నారు. 43 భవనాల్లో భూగర్భజలాలు పెరిగేందుకు ఇంకుడు గుంటలను ఏర్పాటు చేశామన్నారు. 36 చోట్ల కేంద్రాలకు అనుబంధంగా మరుగుదొడ్లను నిర్మించామన్నారు. ఇక గర్భిణులకు, పిల్లలకు తాజా పోషక విలువ గల కూరగాయలు, ఆకుకూరలు అందించినందుకు స్థలాలు అందుబాటులో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ వాటికలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క దాని ఏర్పాటుకు, నిర్వహణకు రూ.పది వేల వరకు ఐసిడిఎస్ నిధులను విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో కూరగాయల విత్తనాల కొనుగోలు పోషణ, ఇతర అంశాల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ ఏదైనా అంగన్వాడీ కేంద్రానికి కూరగాయలు పెంచేందుకు స్థలం లేకపోతే రెండు మూడు కేంద్రాలు ఒక యూనిట్గా ఏర్పడి ప్రభుత్వ భూముల్లో సాగు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తుందని తెలిపారు.

జీవరాశుల మనుగడకు చిత్తడి నేతలు అత్యంత కీలకం

ప్రజాశక్తి - మండవల్లి

జీవరాశుల మనుగడకు చిత్తడి నేలలు అత్యంత కీలకమని ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ అన్నారు. చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని లోకుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిత్తడి నేలలు అనేక జీవరాశులకు ఆవాసంగా, ఉత్పత్తి కేంద్రాలుగా ఉంటాయన్నారు. చిత్తడి నేలలు నీటిని నిల్వ చేస్తాయని, ఆహారం ఉత్పత్తి చేయడానికి అవసరమైన పోషకాలను అందిస్తాయని, అనేక రకాలైన మొక్కలు, జంతువులకు నివాసంగా ఉంటాయని, వరదలు తగ్గిస్తాయని చెప్పారు. వలస పక్షులతో పచ్చదనంతో ఆహ్లాదంగా ఉండి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్న కొల్లేరు సరస్సును కలుషితం కాకుండా పరిరక్షించుకుని ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు డి.అనిల్కుమార్, నరసింహారావు, బి.వేణుబాబు, సాయిబాబు, జనార్ధన్, టివి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రహదారి నియమాలు పాటించాలి

మాట్లాడుతున్న జగదీష్బాబు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకునే మార్గంలో విద్యార్థుల్లో సైతం అవగాహన పెంచడం మరో మార్గమని ఏలూరు అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ ఎస్.జగదీష్బాబు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం శనివారపుపేటలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు, సిబ్బందికి రహదారి భద్రతపై రవాణా శాఖ తనిఖీ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు అజ్మీరా బద్దు, ఎండి.జమీర్, ఎస్.నెహ్రూ, వైఎస్వి.కళ్యాణి, డి.ప్రజ్ఞ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలోని కుమార్ సిబిఎస్సి స్కూల్లో రహదారి భద్రత మాసోత్సవాలు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నాగమురళి ఆధ్వర్యంలో నిర్వహించారు, ఈ కార్యక్రమంలో కుమార్ స్కూలు విద్యార్థులకు రహదారి భద్రత, రోడ్డు సిగ్నల్స్, స్కూల్ బస్సులో ప్రయాణించేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వివిధ అంశాలపై పోటీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం నాగమురళి మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం తాగి వాహనాలను నడపకూడదని, జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలని, సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయకూడదని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కృష్ణవేణి, అన్నపూర్ణ, కుమార్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకట్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యాన వైద్య శిబిరం

ఏలూరు స్పోర్ట్స్:నగరంలోని సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏలూరు సురేష్ బహుగుణ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా అదనపు ఎస్పి ఎన్.సూర్యచంద్రరావు శనివారం ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో శ్రీ పరమహంస యోగానంద నేత్రాలయం వారు నేత్ర పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా ఉచితంగా నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. అనేకమంది ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ చంద్ర బహుగుణ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్రవంతి, ఉప ప్రధానోపాధ్యాయులు జి.వరప్రసాద్, శశి హాస్పిటల్స్ డాక్టర్లు పృధ్వి, నరేష్, బిందు చౌదరి, నేత్ర వైద్యులు ప్రభాకరరావు, సత్యసాయి సేవా సమితి సభ్యులు శశిశేఖరరావు, వెంకటేశ్వరరావు, మూర్తి, బ్రహ్మానందం పాల్గొన్నారు.

ఆర్జియుకెటిలో వ్యక్తిత్వ వికాస సెషన్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్జియుకెటి నూజివీడు క్యాంపస్లో శనివారం పియుసి మొదటి, రెండో సంవత్సర విద్యార్థినులకు జండర్ సెన్సిటివిటీ, వ్యక్తిగత అభివృద్ధిపై సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెఎల్ విశ్వవిద్యాలయ సైకాలజీ ఫ్యాకల్టీ జాస్తి రాజేశ్వరి వక్తగా వ్యక్తిగత అభివృద్ధి, మానసిక వికాసం పెంపొందించుకునే సూచనలు ఇచ్చారు. భావోద్వేగ నియంత్రణ ద్వారా ఉన్నతమైన భవిష్యత్తు ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్జియుకెటి ఎఒ డాక్టర్ లక్ష్మణ్ ఎఫ్ఒ నాగార్జున దేవి, శ్రీనాథ్, డిఎస్డబ్ల్యూల బ్రహ్మస్వాములు, దుర్గాభవాని, తదితరులు పాల్గొన్నారు.

3న నూజివీడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పురపాలక సంఘంలోని కౌన్సిలర్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు వైస్ చైర్పర్సన్ పదవిని నిర్వహించే నిమిత్తం ప్రత్యేక సమావేశం ఈ నెల మూడో తేదీన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట్రామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడు మున్సిపాలిటీ గత రెండు దశాబ్దాలుగా వైసిపికి కంచుకోటగా ఉంది. ప్రభుత్వం ఏది వచ్చినా నూజివీడు మున్సిపాలిటీ మాత్రం మాజీ ఎంఎల్ఎ మేకా ప్రతాప్ అప్పారావు కనుసన్నల్లో ఉండేదని ప్రజలు చెప్పుకుంటున్నారు. నూజివీడు మున్సిపాలిటీలో ప్రతాప్ అప్పారావుకు ఎదురుదెబ్బ తగలనుందనే విశ్వసనీయ సమాచారం. ఈ నెల మూడో తేదీన జరగనున్న నూజివీడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక నేపథ్యంలో వైసిపి నుంచి పలువురు సీనియర్ కౌన్సిలర్లు టిడిపిలో చేరనున్నట్లు సమాచారం.

జనసేన నేత కృష్ణమూర్తి మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు సింగులూరి కృష్ణమూర్తి (75) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు కృష్ణమూర్తి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు తమ్మన సాంబ, పుల్లయ్య, గంగిరెడ్డి నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

కొండంగి ఎత్తిపోతల పథకం కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని కొండంగి ఎత్తిపోతల పథకం 1, 2 ఛైర్మన్లుగా కోటి సూర్యనారాయణరాజు, వేగిరెడ్డి చిన్నారావు ఎన్నిక కాగా వైస్ ఛైర్మన్లుగా సిరిగినేటి రాంబాబు, మహమ్మద్ ఉమర్, జి.భాస్కరరావు ఎన్నికైనట్లు టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు తెలిపారు. కొండంగి ఉప్పుటేరు వద్ద ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం వద్ద జరిగిన సమావేశంలో ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, కోశాధికారి, కమిటీ సభ్యుల ఎన్నిక చేపట్టినట్లు తెలిపారు. డిసి ఛైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి వెంకట సత్యనారాయణ, మండల పరిధిలోని నీటి సంఘం అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో పథకానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి వారి ఆలయం విమాన గోపురం స్వర్ణమయ పథకానికి తాడేపల్లిగూడేనికి చెందిన డి.కాళిదాస్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యానికి అందించారు. అనంతరం దాతల కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయం వారు తీర్థ ప్రసాదాలు, డొనేషన్కు సంబంధించి రసీదులు అందించారు.

ఎంఎల్ఎ దృష్టికి ఆర్ అండ్ ఆర్ సమస్యలు

ప్రజాశక్తి - కుక్కునూరు

ఐటిడిఎ పిఒగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాములునాయక్ను జనసేన, గిరిజన నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పెండింగ్లో ఉన్న ఆర్ అండ్ ఆర్ సమస్యలను పరిశీలించి నిర్వాసితులందరికీ పరిహారం వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒను కోరారు. అనంతరం ఎంఎల్ఎ బాలరాజును కలిసి మండలం మొత్తం యూనిట్గా తీసుకుని 41.15 కాంటూర్లో చేర్చి పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఐటిడిఎ పిఒను, ఎంఎల్ఎను కలిసినవారిలో జనసేన మండలాధ్యక్షుడు మొలిశెట్టి యుగంధర్, జనసేన ఉపాధ్యక్షుడు మంత్రి గోపాలకృష్ణ, నాయకులు మొలిశెట్టి నరేష్, చల్లా కోటి నరసింహారావు, గిరిజన నాయకులు కోరం సంజీవ్, సీతారామయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

KOMMIREDDY SATHYANARAYANA (OLD NAME), S/o. SUBBARAO, DOOR NO: 8-4-54/1, 16th WARD, JUVVALAPALEM, TADEPALLIGUDEM MANDAL, WEST GODAVARI, Dist - 534102, ANDHRA PRADESH CHANGE MY NAME FROM **KOMMI REDDY SATHYANARAYANA** (OLD NAME) TO **KOMMIREDDY SATYANARAYANA** (NEW NAME) HENCE FORTH IAM BEING CALLED AS **KOMMIREDDI SATYANARAYANA** (NEW NAME) FOR ALL PURPOSES.